ఈ కథలో రెస్టారెంట్, దాని వెనక కథ ప్రత్యక్షంగా చూశాను, విన్నాను.
అక్కడ పనిచేసే కుర్రాళ్లని చూస్తున్నప్పుడు అనిపించింది,
పరాయివాళ్లని క్షమించినంత సులువుగా సొంతవాళ్లనిక్షమించలేమని?
అందులోంచి వచ్చిందే ఈ కథ.

మృణాళిని

# 5 సెకండ్ ఛాన్స్





అమెరికాలో రెస్టారెంట్లకు వెళ్లడం నాకు సరదా. తిండి మాటేమోగానీ, అక్కడ వెయిటర్ల చిరునవ్వులు, ఓపిగ్గా సమాధానాలు చెప్పే పద్ధతి, మనల్ని సొంత కుటుంబసభ్యుల్లా పలకరించే విధానం నాకు బాగా నచ్చుతాయి. నేనా మాట అంటే రాధ నవ్వింది.

"నిజమే. పైగా ఇక్కడ కొన్ని రూల్సుంటాయి. లోపలికి వెళ్లగానే ఖాళీగా ఉంది కదాని మనం వెళ్లి కూర్చోకూడదు. రిసెప్షన్‌లో నించుని ఎంతమందిమో చెప్పాక వాళ్లే మనల్ని టేబిల్ దగ్గరకు తీసుకెళ్తారు..." రాధ మాట పూర్తి కాకుండానే ఒక వెయిటర్ వచ్చాడు. రాధను చూసి పలకరింపుగా నవ్వాడు. తను కూడ నవ్వి, 'టూ' అంది. మేము అతనితో టేబిల్ దగ్గరకు వెళ్లేలోగా గోడకు అంటించిన ఎన్నో కాయితాలని చూశాను. వాటి మీద ఏవో సూక్తుల్లాంటివి పెన్నుతో రాసి వున్నాయి. కనీసం మూడు పోస్టర్ల మీద, 'వన్ మోర్ ఛాన్స్,' అని వుంది. ఈలోగా మా టేబిల్ దగ్గరికి వచ్చాం. కూర్చోగానే రాధ,

"ఏమైంది ఆంటీ. వింతగా చూస్తున్నావ్?" అంది తను.

ఆ కేఫ్ చుట్టూ చూసి అడిగాను.

"ఇక్కడికి తరచూ వస్తూంటావా? మీదేశంలో ఎప్పుడూ తెలిసిన వాళ్లల్లే పలకరిస్తూంటారనుకో. కానీ వేరే వెయటర్లు కూడ నిన్ను గుర్తు పట్టినట్టు కనిపిస్తున్నారు?" అడిగాను.

అవునన్నట్టు తలవూపింది.

"ఇది నాకూ సంకేత్‌కు ఇష్టమైన అడ్డా... మమ్మల్ని అందరూ గుర్తుపడతారు," అంది.

"ఎందుకు? తిండి అంత బాగుంటుందా?" అడిగాను.

రాధ తల అడ్డంగా తిప్పి అంది.

"రుచి గురించి కాదు ఆంటీ... ఐమీన్ పిన్నీ... రుచులు కూడ బాగుంటాయనుకో... అదికాక... వీళ్లంటే మాకిష్టం," అంది.

నేను డెట్రాయిట్‌కి వచ్చి రెండురోజులైంది. ముందు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక బయటకు వెళ్దాంలే అంటే రాధ ఒప్పుకోలేదు.

"నువ్వుండే వారంరోజుల్లో ఇంకా రెస్టు తీసుకుంటూంటే అయినట్టే ఉంది," అంటూ ఆరోజు ఆర్ట్ గాలరీకి తీసుకువెళ్లింది.

నాకవి ఇష్టమని తనకూ తెలుసు. మైనస్ ఏడు డిగ్రీల్లో ఇంట్లోంచి కారు ఎక్కే వరకూ వణికినా, ఆర్ట్ గాలరీకి వెళ్లాక ఆ చలిని

కూడ మరిచిపోయాను. పికాసో, రెంబ్రాంట్, ఫ్రిడా, వాన్ గో, వెడ్డింగ్ డాన్స్... ముఖ్యంగా డిగో రివేరా 'మ్యూరల్' ఇవన్నీ చూస్తోంటే నాలుగు గంటలు ఎంత త్వరగా గడిచిపోయాయో. అక్కడి కాంటీన్‌లోనే కపూచినో తాగి ఏమీ తినబుద్ధి కావడం లేదన్నాను. పొద్దున్నే ఇంట్లో మూడు దోశెలు లాగించాం మరి.

ఇంకా కాస్సేపు డౌన్ టౌన్ చూపించాక, ఆన్ ఆర్బర్‌లో ఒక రెస్టారెంట్‌కి వెళ్దామంది. డెట్రాయిట్‌లో హోటళ్లు లేనట్టు అక్కడిదాకా ఎందుకూ అని విసుక్కున్నాను.

''మిషిగన్‌కి ఎవరు వచ్చినా ఆ రెస్టారెంట్‌లో తినాల్సిందే. అది నా రూలు,'' అంటూ లాక్కెళ్లింది.

ఫోర్డ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న పిల్ల నాకోసమని రెండు రోజులు సెలవు పెట్టుకుని తిరుగుతూంటే, నేను తన మాట కాదనలేక ఎక్కడికి తీసుకెళ్తే అక్కడికి వస్తానని చెప్పేసాను. అలా ఇక్కడ తేలాం.

నేను ఇంతకుముందు కూడా అమెరికాకు వచ్చినా ఎప్పుడూ నా కూతురున్న కాలిఫోర్నియాలోనే అన్ని రోజులూ గడిపేసేదాన్ని. అమ్మమ్మ డ్యూటీ కదామరి. వేరే చోట్లు చూసే పరిస్థితే లేదు. ఇప్పుడిక డ్యూటీలు అయిపోయాయి. పిల్లలకు నా అవసరం లేదు. అలాగే పెద్దలకు కూడా... అమ్మాయి, అల్లుడు ప్రేమగానే ఉంటారు కానీ... నేను ఎక్కువ రోజులుండకపోయినా బాధపడరని నాకూ అర్థమైంది. అమ్మాయికి వారంరోజులు యూరప్‌లో కాన్ఫరెన్స్ ఉంది కనక రమ్మని అడిగింది. అందుకే నన్ను ఎప్పటినుంచో రమ్మంటున్న నా కజిన్ కూతురు రాధ దగ్గరికి ముందుగా వచ్చాను. ఇక్కడినుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకి వెళ్లి అమ్మాయి తిరిగి రాగానే అక్కడినుంచే భారతదేశానికి వెళ్లాలని రిటర్న్ టికెట్ బుక్ చేసుకున్నాను.

''ఇంతకూ వీళ్లంటే నీకు ఎందుకిష్టం?'' అడిగాను.

రాధ అప్పటిదాకా ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది. తనకు మొదట్నుంచీ తెలుగులో మాట్లాడ్డం సమస్యే. నాలుగు పదాలు తెలుగులో అంటే, తెలీకుండానే ఇంగ్లీషులోకి వెళ్లిపోతుంది. ఇక పదిహేనేళ్ల నుంచీ అమెరికాలో స్థిరపడ్డాక చెప్పనవసరం లేదు. బెంగాలీ కుర్రాడిని కట్టుకోవడం మరో సాకు తెలుగు మరచిపోడానికి.

ఇప్పుడు హఠాత్తుగా తెలుగులోకి మారిపోయింది. కూడబలుక్కున్నట్టుగా అన్నా, సరిగ్గానే చెప్పింది.

''వీళ్లంతా నేరచరిత్ర ఉన్నవాళ్లు పిన్నీ.''

నేను ఉలిక్కిపడ్డాను. తను 'నేరచరిత్ర' లాంటి పెద్ద పదం వాడినందుకే కాదు. అలాంటి వాళ్ల హోటల్‌కి నన్నెందుకు తీసుకువచ్చిందని.

''దీన్ని పెట్టిన అబ్బాయి... ఉష్... వెంటనే చూడకు... అక్కడ కుడివేపు నించుని ఒక ఆఫ్రికన్ అమెరికన్ అమ్మాయితో మాట్లాడుతున్నాడే, అతను ఇదివరకు డ్రగ్స్ అమ్మేవాడు. మొదలెట్టిన కొద్దిరోజుల్లోనే అరెస్టయ్యాడు. జైలు ముగించుకుని వచ్చాక కొన్నిరోజులు ఎవరూ ఉద్యోగం ఇవ్వలేదు. ఇక్కడ ఇంతకుముందు మరో అతని రెస్టారెంట్ ఉండేది. అతనికి ఇతని గతం తెలుసే అమ్మాడో, తెలీక అమ్మాడో నాకు తెలీదు. కానీ మొత్తానికి ఇతనికి అమ్మేశాడు...''

నేను ఆశ్చర్యపోయాను.

"తెలిస్తే ఎందుకు అమ్ముతాడే... తెలీదు కనకే అమ్మివుంటాడు," అన్నాను.

రాధ అడ్డంగా తల తిప్పింది. "అంత కొట్టిపారేయకు పిన్నీ... అతను ఏం చేసేవాడో ఈ హోటల్‌కి వచ్చే మాలాంటి కస్టమర్లందరికీ దాదాపుగా తెలుసు. అలాంటప్పుడు అమ్మినవాడికి తెలీకుండా ఉంటుందా."

"అందరికీ నీలాగే కాస్తంత పిచ్చిలా ఉం," అన్నాను చిరాగ్గా.

రాధ నవ్వింది.

"మనకు సర్వ్ చేశాడు చూడు. అతను దొంగ. షాపుల అద్దాలు పగలగొట్టి అందినంత ఎత్తుకుపోయేవాడు."

నేను కెవ్వుమన్నంత పనిచేశాను.

"నన్ను ఎక్కడికి తీసుకువచ్చావే తల్లీ," అన్నాను.

ఇద్దరం లోగొంతుకతోనే మాట్లాడుతున్నా నా గాభరా దానికి అర్థమవుతూనే ఉంది.

"ఇతనేకాదు, ఈ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న వాళ్లలో మూడొంతుల మంది పాత నేరస్థులు. జైలు శిక్షలు ఆరునెల్ల నుంచి ఆరేళ్ల వరకూ అనుభవించిన వాళ్లే..."

ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ, చిరునవ్వు చెక్కుచెదరకుండా, ఎక్కడా ఆలస్యం చేయకుండా, ఒక్కొక్కళ్లూ పదేసి టేబిళ్లకు సర్వ్ చేస్తున్న విధానం చూస్తుంటే ఎంత ముచ్చటగా ఉందో. వీళ్లంతా జైలుపక్షులా! నాకు ఎంతో రుచిగా ఉన్న నూడుల్స్ గొంతు నుంచి దిగడంలేదు. ఇన్ని నేరాలు చేసినవారిపట్ల ఈ పిల్లకు అంత ప్రేమేమిటీ... ఎవరు తన ఇంటికి వచ్చినా ఇక్కడికి తీసుకురావాలన్న నియమం ఏమిటీ... ఇంత దయ... నాకెక్కడో మనసు కలుక్కుమంది. గతంలోకి వెళ్లబోతున్న మనసును అదుపు చేసుకున్నాను.

రాధ చెప్తోంది.

"మారియో... అదే... ఈ హోటల్ పెట్టినవాడు... తనకు జీవితంలో రెండో ఛాన్స్ దొరకడం చాలా అపురూపంగా భావించాడట. అందుకే తనలాంటి వాళ్లను వెదికి పట్టుకుని మరీ ఉపాధి ఇచ్చాడు... ఎంత గొప్ప విషయం కదా... జీవితంలో పొరబాట్లు అందరం చేస్తాం. అందరికీ శిక్ష కూడ పడదు. కానీ వీళ్లందరూ శిక్షలు అనుభవించిన వాళ్లే. అలాంటి వాళ్లకి సెకండ్ ఛాన్స్ ఇవ్వాలనుకోవడం న్యాయం కదూ... అందుకే నాకు వీళ్లందరంటే అంత గౌరవం... ఎంత చక్కగా జీవితాన్ని దిద్దుకున్నారో..."

నేను మాట్లాడలేదు. అందుకేనా 'వన్ మోర్ ఛాన్స్' అని అన్ని పోస్టర్లు అంటించారు! అలా మరో అవకాశం ఇవ్వడం న్యాయమా? అదేనా రాధ ఇందాకట్నుంచీ చెప్తోంది... మనసులో కలత మరింతగా పెరిగింది..

...ఇంకాస్సేపు అక్కడా ఇక్కడా నన్ను తిప్పి, టార్గెట్‌కూ, ట్రేడర్ జోస్‌కూ తీసుకువెళ్లి అవసమైనవన్నీ కొనుక్కుని ఇంటికి వచ్చాం.

రాత్రి పడుకున్నానన్నమాటేగానీ నిద్ర రావడం లేదు. చిన్నప్పటి నుంచీ ఎంతో కలిగిన కుటుంబంలో అల్లారు ముద్దుగా పెరిగి, అమెరికాలో చదువుకోవాలన్న కోరిక తీర్చుకుని, తనకిష్టమైన అబ్బాయిని పెళ్లి చేసుకుని, జీవితమంతా వడ్డించిన విస్తరిలా బతుకుతున్న రాధ ఇలాంటి వాళ్ల గురించి అంత సానుభూతి ఎలా చూపగలిగింది? ఆ అమ్మాయిలో ఆ సంస్కారం ఎలా వచ్చింది? భారీగా టిప్పులిచ్చింది కూడానూ, ఈ దేశంలో సర్వర్‌లకు టిప్పులు ఇవ్వడం అనివార్యమంటూ... వాళ్లకు హోటల్ ఇచ్చే జీతం తక్కువట. అందుకే భారీగా టిప్ ఇవ్వాలని కంకణం కట్టుకున్నారు తనూ, తన భర్తా... అసలు, మొదట్నుంచీ దొంగబుద్ధి ఉన్న వీళ్లు తను ఇచ్చిన డబ్బుల్ని దుర్వినియోగం చెయ్యరన్న భరోసా ఏమిటి ఈ పిల్లకు? తప్పు చేసిన మనుషుల్లో కూడా మంచి ఉంటుందని ఎంత ధీమా తనకు! ఎలా నమ్ముతోంది వీళ్లని!

ఉదయం హోటల్ గురించి విన్నప్పటి నుంచీ నాకు మనసులో ఏవేవో జ్ఞాపకాలు... మనసంతా వికలంగానూ ఉంది. ఆనందంగానూ ఉంది. రెండిటికీ కారణం స్పష్టంగా తెలీడం లేదు.

రాత్రి కల... ఉంగరాల జుట్టూ, 10వ యేటే షార్ట్ సైట్‌తో వచ్చిన కళ్లద్దాలు... ఎప్పుడూ నలిగిన దుస్తుల్లోనే ఉన్నా, పొగరుగా, అందంగా ఉన్న ముఖవర్చస్సూ... అందరితో తెంపరిగా మాట్లాడినా, తనను చూడగానే మార్దవంగా మారిపోయే కంఠ స్వరం... ఆ ఆకృతి... ఎలాగో రాత్రి ముగిసింది.

పొద్దున్నే లేవగానే మళ్లీ అదే ఆకృతి... నా 13వ యేట, ఇంటి నుంచి వెళ్లి పోయిన 16 ఏళ్ల అన్నయ్య ముఖం. అన్నయ్యంటే ప్రాణం పెట్టే అమ్మ ఆరోజు నుంచీ ఎప్పటికీ మామూలు మనిషి కాలేదు. ఇరవై యేళ్ల తర్వాత మద్రాసులో ఏదో బాంకులో పనిచేస్తున్నాడని ఎవరి ద్వారానో తెలిసింది. అమ్మ నన్ను వెళ్లి వాణ్ణి తీసుకురమ్మని ఎన్నిసార్లు అడిగిందో... నేను వెళ్లలేదు. వాడు గనక ఈ ఇంటికి వస్తే నేను మళ్లీ ఆ ఇంటి గడప తొక్కనని అమ్మకు చెప్పేశాను. ఇంటి బాధ్యతలు, అమ్మానాన్నల ప్రేమ అన్నీ వదిలేసుకుని తన జీవితం తను చూసుకుని వెళ్లిపోయినవాడు; ఆడపిల్లనైనా నేనే ఇద్దరినీ వార్ధక్యంలో చూసుకోవలసిన పరిస్థితి కల్పించినవాడు... వాణ్ణి మళ్లీ చూడడం నావల్ల కాదని చెప్పేశాను. అమ్మ ఏమనగలదు? నామీద ఆధారపడి బతుకు తోందాయె.

మరి కొన్నేళ్లకు తనే మా ఆచూకీ తెలుసుకున్నట్టున్నాడు.

నా ఆఫీసుకు ఓసారి ఫోన్ చేశాడు.

"శారదా... నేను పెద్ద తప్పే చేశాను. సమర్థించుకోను. కానీ మిమ్మల్ని తలచు కోని రోజులేదు. తిరిగిరావడానికి నామోషీ. ఏం గొప్ప సాధించానని రావాలి అనుకున్నాను. కానీ ఇటీవల అనిపిస్తోంది. సొంత ఇంటికి రావడానికి ఏ గొప్పలూ సాధించనవసరం లేదుకదా అని... ఒకసారి వచ్చి అమ్మను చూస్తానే... కనీసం క్షమాపణ చెప్పుకోడానికైనా ఒక్క అవకాశం ఇవ్వవే... నాన్న ఎలాగూ పోయారు..."

ఓ పావుగంట కష్టపడి, ఈ నాలుగు వాక్యాలూ ఎలాగో అన్నాడు. వాడికి నేను సమాధానం కూడ చెప్పలేదు. ఫోన్ పెట్టేశాను. ఇన్నేళ్లుగా తను నాకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయలేదు. నాన్న అన్నయ్యను చూడకుండానే పోయారు. అన్నయ్య ఆచూకీ దొరికిన విషయం నాన్నకు నేను చెప్పలేదు. అమ్మను చెప్పొద్దని శాసించాను కూడా... అమ్మ నాతోనే ఉంటుంది. పైకి చెప్పదు కానీ మనసులో నామీద కోపం, అసంతృప్తి ఉన్నాయని తెలుసు. ఇప్పుడు అన్నయ్య వయసెంత వుంటుంది? 68 నాకు 65 కదా...

"ఏం పిన్నీ... అలా వున్నావు? ఆ హోటల్ కుర్రాళ్లు కల్లోకి వచ్చి నీ ఇల్లు దోచుకుపోయారా ఏంటి?" అంది నవ్వుతూ రాధ.

నేనూ నవ్వాను, "కల్లోకి వచ్చిన మాట నిజమే... కానీ దోచుకోడానికి కాదు. కళ్లు తెరిపించడానికి," అన్నాను. రాధ అర్థం కానట్టు చూసింది.

ఏం చెప్పను రాధకి. నందగోపాల్ అనే వేలు విడిచిన మామయ్య ఒకడు తనకున్నట్టు కూడ తెలీదు పాపం. అమాయకత్వంతోనో, దుందుడుకుతనంతోనో, తోటి మిత్రుల ప్రభావం వల్లో... లేక అంతకంటే పెద్ద కారణం... చీటికీ మాటికీ తనని తిట్టి, కొట్టిన నాన్న పట్ల ఏహ్యాభావంతోనో... ఎందుకో... అలా వెళ్లిపోయాడు. ఎలా బతికాడో, ఎన్నెన్ని పనులు చేశాడో. ఏం చదువుకున్నాడో కూడ తెలీదు. అతను ఏ పరిస్థితుల్లో ఆ అపరాధం చేసి వుంటాడో నేను ఏనాడూ ఆలోచించలేదు... నా మనసులో కలత క్రమక్రమంగా తగ్గుతోంది... దాని స్థానంలో ఉద్వేగం; ఆనందం...

ఎపుడెపుడు చెన్నైలో ఉన్న అన్నయ్యకు ఫోన్ చేద్దామా అని తహతహ. ఇప్పుడు ఇండియాలో రాత్రి 10 దాటి వుంటుంది. ఇప్పుడు చెయ్యనా? అమ్మ పడుకుని వుంటుంది. అన్నయ్యకు చెయ్యనా? తను కూడ పడుకున్నాడేమో... ఇంతకూ అమ్మకు ముందు చెయ్యనా? అన్నయ్యకా... ఇండియాలో తెల్లారేవరకూ ఆగగలనా?...

*ఈమాట అంతర్జాల పత్రిక*
*ఏప్రిల్ 2020*

✻




మృణాళిని 17 మే 1957లో కాకినాడలో జన్మించినా, తల్లిదండ్రులది రాయలసీమ. వీరి మొదటి కథ నిర్ణయం వనిత మాసపత్రికలో అచ్చయ్యింది. రచయితగా, విద్యావేత్తగా, కాలమిస్ట్‌గా, టీవీ రేడియో ఛానల్లలో ప్రయోక్తగా, వివిధ రూపాల్లో తెలుగు పాఠకులకు, ప్రేక్షకులకు పరిచితురాలు. కోమలి *గాంధారం* కథాసంపుటి ప్రచురించారు. పలు విమర్శ గ్రంథాలు, జీవితచరిత్రలు, 14 అనువాద గ్రంథాలతో కలిపి 28 పుస్తకాలు ప్రచురించారు. తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

***చిరునామా: 602, ఈడెన్ సి, లోధ, కాసాపారడిసో, సనత్‌నగర్, హైదరాబాద్-500018***

***ఫోన్: 98490 65147 mrunalini8@gmail.com***